క్లుప్తంగా

దర్గాలో ప్రార్థనలు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

టేక్మాల్(మెదక్): కర్ణాటకలోని హజ్రత్ ఖ్వాజా బందా నవాజ్ షరీఫ్ (గుల్బర్గ దర్గా)లో తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు మెదక్ జిల్లా మైనార్టీ చైర్మన్, మండల కో ఆప్షన్ సభ్యులు మజహర్ తెలిపారు. ఇందులో టేక్మాల్ మండల ముస్లిం నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ



శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో మెదక్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతి రెడ్డి సోదరుడు కంఠారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పరామర్శించారు. ఈ మేరకు సోమవారం కంఠారెడ్డి తిరుపతి రెడ్డి స్వగృహంలో తన సోదరుడు కంఠారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి దశదిన కర్మలో పాల్గొని సానుభూతి తెలిపారు.

నారుమడుల పరిశీలన



నారుమడులు పరిశీలిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి, సర్పంచ్ ఈస్తారి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బండపోతుగల్ గ్రామంలో సోమవారం నారుమడులను పరిశీలించానని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణ పరిస్థితులు చల్లగా మారిపోయాయని, రైతులు నారు మడుల్లో నీటిని ఎప్పటికప్పుడు తీసి వేస్తూ ఉండాలన్నారు. నారుమడి ఎర్రగా మారుతున్నట్లు అనిపిస్తే, ఫార్ములా 4ను లీటర్‌కు 2 గ్రాములు కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అదేవిధంగా కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈస్తారి, ఏఈఓ భూపాల్ ఉన్నారు.

బస్సును పునరుద్ధరించాలి



వినతిపత్రం అందిస్తున్న యువకులు

టేక్మాల్(మెదక్): మెదక్ నుంచి మండలంలోని శేరిపల్లి, ఎలకుర్తి, కోరంపల్లి, ధనూర మీదగా జోగిపేట, సంగారెడ్డి వరకు నడిచే బస్సును నిలిపి వేశారు. వెంటనే దాన్ని ప్రారంభించాలని కోరుతూ.. ఆర్టీసీ డిపో మేనేజర్ వీరబాబును యువకులు సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్సు సర్వీస్ నిలిపి వేయడంతో విద్యార్థులు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉందని బస్సును వెంటనే ప్రారంభించాలని కోరినట్లు చెప్పారు. ఈ విషయమై ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ మెదక్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌రెడ్డి, ఎలకుర్తి గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు బట్టు ప్రసాద్, రేషన్ డీలర్ సారా జగదీష్ తదితరులు ఉన్నారు.

కోతి దాడిలో వృద్ధుడికి గాయాలు



గాయపడ్డ పోచయ్య

శివ్వంపేట(నర్సాపూర్): కోతి దాడిలో వృద్ధుడికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని చెన్నాపూర్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుండా పోచయ్య తన ఇంటి ఆరు బయట ఉండగా కోతి వచ్చి దాడి చేసి గాయపరిచింది. గుర్తించిన కుటుంబ సభ్యులు పోచయ్యను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తీసుకెళ్లారు. గ్రామంలో కోతుల బెడదతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

భూ సేకరణ పనులు నిలిపివేయాలి



ప్రజాభవన్‌కు పాదయాత్రగా వెళుతున్న రైతులు

ప్రజాభవన్‌కు రైతుల పాదయాత్ర

నర్సాపూర్ రూరల్: కొండపోచమ్మ కాల్వ ఏర్పాటు కోసం చేపడుతున్న భూ సేకరణ పనులు వెంటనే నిలిపివేయాలని కోరుతూ.. మండలంలోని ఐదు గ్రామాల రైతులు సోమవారం ప్రజాభవన్‌కు పాదయాత్రగా బయలుదేరారు. మండలంలోని పెద్ద చింతకుంట, చిన్నచింతకుంట, గొల్లపల్లి, లింగాపూర్, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులు మండలంలోని పెద్దచింతకుంట జల హనుమాన్ ఆలయం నుంచి హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు సుమారు 60 కిలో మీటర్ల దూరం పాదయాత్రగా వెళ్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొండ పోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి వరకు ఏర్పాటు చేయబోయే కాల్వ కోసం పెద్ద చింతకుంటలో 60, చిన్నచింతకుంటలో 50, గొల్లపల్లి, లింగాపూర్ గ్రామాల్లో కలిపి 58, బ్రాహ్మణపల్లిలో 44 ఎకరాల భూమి సేకరించేందుకు అధికారులు ముమ్మరంగా చర్యలు చేపట్టారని తెలిపారు. పై గ్రామాల్లో అర ఎకరం నుంచి రెండు ఎకరాల లోపు భూములున్న రైతులకు సంబంధించిన భూములు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే భూసేకరణ పనులు నిలిపి వేయాలని కోరుతున్నారు. తమకు జరిగే నష్టాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విన్నవించేందుకు ప్రజాభవన్‌కు పాదయాత్రగా వెళ్తున్నామన్నారు. భూములు పోతే తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోతే తిరిగి భూములు కొనలేని స్థాయికి ఇక్కడి భూములకు రెక్కలు వచ్చాయన్నారు.

భూములు సేకరించొద్దు



కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి వరకు ఏర్పాటు చేయనున్న కాల్వ పనులు వెంటనే నిలిపివేయాలి. భూములు సేకరించొద్దు. ఇప్పటికీ ఈ మండలం మీదుగా కాళేశ్వరం కాల్వ పనులే పూర్తి కాలేదు. దానికోసం భూములు కోల్పోయిన రైతులు రోడ్డున పడ్డారు. అంతటితో ఆగకుండా కొండపోచమ్మ కాల్వ కోసం భూముల సేకరణకు పూనుకోవడం తగదు.

– మహేశ్‌గౌడ్ రైతు, చిన్నచింతకుంట

భూమికి భూమి ఇవ్వాలి



భూముల సేకరణ తప్పని ఎడల భూమికి భూమి ఇవ్వాలి. వ్యవసాయన్ని నమ్ముకొని బతుకుతున్న తమకు భూములు కోల్పోతే బతకడం కష్టమవుతుంది.

– కొండల్ రైతు, బ్రాహ్మణపల్లి

ఎకరాకు రూ.కోటి ఇవ్వాలి

నర్సాపూర్ మండలం హెచ్ఎండీఏ పరిధిలో ఉండడంతో ఇక్కడి భూములు ఎకరాకు కోటి నుంచి రెండు కోట్లు పలుకుతుంది. దాన్ని దృష్టిలో పెట్టుకొని నష్టపరిహారం చెల్లించాలి.

– ఉప్పలపు శ్రీనివాస్, రైతు, లింగాపూర్

తప్పులు లేకుండా ఓటరు జాబితా



బీఎల్‌ఓలకు సూచనలిస్తున్న తహసీల్దార్ తులసీరాం

శివ్వంపేట(నర్సాపూర్): ఓటరు లిస్టులో తప్పులు లేకుండా నమోదు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్‌చారి అన్నారు. సోమవారం ఎంపీడీఓ సమావేశ మందిరంలో బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల కోసం ఓటర్ల జాబితా సవరణ కోసం కేంద్రం ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిందని చెప్పారు. అందులో భాగంగా ఈ నెల 20 నుంచి వచ్చే నెల 5 వరకు పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులు, ఓటర్ల ఫొటోలు మార్పునకు అవకాశం కల్పించిదన్నారు. 1 జనవరి 2024 వరకు 18 ఏళ్లు నిండిన యువతి, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫీయొద్దీన్, ఆర్ఐ కిషన్, ఏఎల్ఎంలు ప్రసన్నకుమార్, బాబు, రాములు, తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితాలో తప్పులు సరిదిద్దుకోవాలి

వెల్దుర్తి(తూప్రాన్): రానున్న పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులకు అవకాశం లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ తులసీరాం అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లతో సమావేశం నిర్వహించారు. ఓటరు తుది జాబితాను ప్రచురించేందుకు సర్వం సిద్ధం చేయాలని సూచించారు. కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లను పొందుపరిచి, మరణించిన వారు, ఇతర గ్రామ పంచాయతీలకు మారిపోయిన వారి పేర్లను తొలగించాలన్నారు. పోలింగ్ స్టేషన్ మార్పు కోరుకున్న వారి పేర్లను మార్పులు, చేర్పులు చేసి తుది జాబితాను ప్రచురణకు సిద్ధం చేయాలన్నారు. లేనిపక్షంలో ఉన్నతాధికారుల ఆదేశానుసారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో గిర్దావర్‌లు జయభారత్‌రెడ్డి, ధన్‌సింగ్, శిక్షకులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ నేతల బాహాబాహీ

మండల సమావేశంలో వాగ్వాదం



వాగ్వాదానికి దిగిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల సర్వసభ్య సమావేశంలో బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు బాహాబాహీకి దిగారు. సోమవారం మధ్యాహ్నం ఎంపీపీ రాజునాయక్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే సునీతారెడ్డి హాజరయ్యారు. అయితే సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు స్టేజీపై కూర్చోడంతో బీజేపీ మండల అధ్యక్షుడు రాకేశ్, వెల్మకన్న సర్పంచ్ రాజేందర్ ఎంపీడీఓను ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధ్యక్షుడిని పిలిస్తే కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షులను సైతం పిలవాలని డిమాండ్ చేశారు. రైతుబంధు సమితి అధ్యక్షుడి హోదాలో అయన వచ్చారని ఎంపీడీఓ శ్రీనివాస్ సమాధానం చెప్పారు. జిల్లాలో ఎక్కడాలేని విధంగా ఇక్కడ పార్టీనాయకులను సమావేశాలకు పిలుస్తున్నారని కాంగ్రెస్, బీజేపీ అధ్యక్షులను సైతం పిలవాలని బీజేపీ నాయకులు అధికారులను డిమాండ్ చేశారు. దీంతో పలువురు బీఆర్ఎస్‌పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కల్పించుకుని అడగడానికి మీరెవరంటూ బీజేపీ నాయకులతో వాగ్వాదానికి దిగారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాకేశ్ ను బయటకు గెంటివేశారు. అనంతరం సునీతారెడ్డి మాట్లాడుతూ ప్రతి విషయాన్ని రాజకీయం చేయవద్దని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేద్దామని చెప్పారు.

ఎంపీపీ సర్వసభ్య సమావేశం వాయిదా

12 మంది ఎంపీటీసీలు గైర్హాజరు



ఎంపీటీసీలు హాజరవకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండల పరిషత్ సర్వసభ్యసమావేశం వాయిదాపడింది. సోమవారం మధ్యాహ్నం ఎంపీపీ సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉండగా ఎంపీటీసీ సభ్యులు గైర్హజరయ్యారు. 13 మంది ఎంపీటీసీలు ఉండగా ఎంపీపీ భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సునీత మాత్రమే హాజరయ్యారు. వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్ ఎంపీపీ కార్యాలయం వద్దకు వచ్చినప్పటికీ సమావేశ మందిరంలోకి రాకుండానే వెళ్లిపోయారు. దీంతో గంట పాటు వేచిచూసిన ఎంపీడీఓ ప్రవీణ్ ఎంపీటీసీ సభ్యుల కోరం లేనందున సమావేశం వాయిదా వేస్తున్నట్టు ప్రకటించారు.

కేవైసీకి గడువు లేదు



గ్యాస్ డీలరు ఆఫీసు వద్ద వినియోగదారులు

నర్సాపూర్: గ్యాస్ వినియోగదారులు ఈకేవైసీ చేయించుకునేందుకు డీలరు ఆఫీసు వద్ద రోజూ బారులు తీరుతున్నారు. వంటగ్యాస్ సిలిండర్‌పై ప్రభుత్వ సబ్సిడీ రావాలంటే ఈ కేవైసీ చేయించుకోవాలన్న పుకార్లు రావడంతో సోమవారం స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఆఫీసు వద్ద వినియోగదారులు బారులు తీరారు. ఈ కేవైసీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, చివరి రోజు అంటూ ఏ గడువూ లేదని అధికారులు ప్రకటించినా వినియోగదారులు మాత్రం రోజూ బారులుతీరుతున్నారని అధికారులు వాపోతున్నారు. ఇదిలాఉండగా గ్రామ స్థాయిలో గ్యాస్ వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వస్తున్నాయి.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

శివ్వంపేట(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ బాలుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మండల పరిధిలోని చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన రోహిత్(8) గత 15న చిన్నగొట్టిముక్ల చౌరస్తా వద్ద రోడ్డు దాడుతుండగా లారీ ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడడంతో కుటుంబ సభ్యులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో రోహిత్ సోమవారం ఉదయం మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌తో పాటు లారీని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు.

21న సృజన టెక్ ఫెస్ట్

మెదక్ కలెక్టరేట్: జిల్లా స్థాయిలో జరగనున్న 'సృజన టెక్ ఫెస్ట్‌ను' సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ విద్యార్థులు వినియోగించుకోవాలని మెదక్ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టెక్ ఫెస్ట్ డిప్లొమా విద్యార్థుల్లో మంచి సృజనాత్మకత, నూతన పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు రూపొందించేందుకు ఉపయోగపడుతుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 21 ఉదయం మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ టెక్ ఫెస్ట్‌ను ఏర్పాటు చేస్తున్నామని, సివిల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ విద్యార్థులంతా వినియోగించుకోవాలిన సువర్ణలత కోరారు.

రెండు రోజులు నీళ్లు బంద్

నర్సాపూర్: మిషన్ భగీరథ నల్లాల నుంచి రెండు రోజుల పాటు నీటి సరఫరా ఉండదని డీఈఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సంగారెడ్డి జిల్లా హత్నూరలోని భగీరథ నీటి శుద్ధి కేంద్రం సమీపంలో మెయిన్ పంపింగ్ పైపులైనుకు లీకేజీ ఏర్పడింది. దీంతో దానికి 19, 20 తేదీల్లో మరమ్మతులు చేస్తామని చెప్పారు. జిల్లాలోని నర్సాపూర్, వెల్దుర్తి, శివ్వంపేట, కౌడిపల్లి, కొల్చారం మండలాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం, గుమ్మడిదల్ల మండలాల్లోని సుమారు 450 గ్రామాలకు 19, 20 తేదీల్లో నీటి సరఫరా ఉండదని వివరించారు. ఈనెల 21 నుంచి నీటి సరఫరా యథావిధిగా ఉంటుందన్నారు.

మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలి

శివ్వంపేట(నర్సాపూర్): మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని జోన్ సాధన సమితి సభ్యుడు ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్‌లో ఉంచడం వల్ల ఇక్కడి జిల్లా నిరుద్యోగులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ కల్లూరి హరికృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఆర్ఐ కిషన్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, చంద్రశేఖర్, జీవన్‌కుమార్, స్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

కొండపాక(గజ్వేల్): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ఉపాధి కోల్పోతున్నామని మండలంలోని దుద్దెడలో సోమవారం ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఆరెల్ల నర్సింలు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 15 వేల భృతి చెల్లించి ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్ యూనియన్ సభ్యులు అంజి, లింగం పాల్గొన్నారు.

అర్హులకు కేంద్ర పథకాలు అందాలి



బండపోతుగల్‌లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): అర్హులకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ముఖ్య ఉద్దేశమని నోడల్ అధికారి ఏపీజీవీబీ చిట్కుల్ శాఖ మేనేజర్ చంపాలాల్ అన్నారు. సోమవారం మండలంలోని బండపోతుగల్ గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వివిధ శాఖలకు చెందిన అధికారులు మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు కేంద్రం అందిస్తున్న ఈజీఎస్, పీఎం కిసాన్ యోజన, పీఎం సురక్ష యోజన, అటల్ పెన్షన్ యోజన, ఉజ్వల గ్యాస్ పథకం తదితర పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఈస్తారీ, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, ఏఓ బాల్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం రాంచంద్రారెడ్డి, టీఏ హన్మంతు, వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్, విద్యుత్, ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి, కౌడిపల్లి ఎస్‌బీఐ మేనేజర్ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని దేవులపల్లి, ధర్మాసాగర్ గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు పంట రుణాలు ఇస్తుందన్నారు. పీఎం బీమా యోజన, పీఎం సురక్షబీమాతోపాటు ముద్ర రుణాలు ఇస్తుందని చెప్పారు. అనంతరం పథకాలను విగియోగించుకోవాలని గ్రామస్తులతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీఓ పుణ్యదాస్, ఏపీఎం సంగమేశ్వర్, సర్పంచ్‌లు ప్రమీళ, ఆశమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, నాయకులు సత్తయ్య, రాజు పాల్గొన్నారు.

పిల్లలను ఇంటి వద్ద చదివించాలి



మాట్లాడుతున్న ప్రమీళరాణి

చేగుంట(తూప్రాన్): పిల్లలను ఇంటి వద్ద కూడా చదివించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రమీళరాణి అన్నారు. సోమవారం చేగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను ప్రతీరోజు కళాశాలకు పంపించాలన్నారు. ప్రతీరోజు క్రమం తప్పకుండా ఇంటి వద్ద కూడా పిల్లలను చదివించాలని కోరారు. సెల్ ఫోన్‌లను వీలైనంత వరకు తక్కువగా వినియోగించేలా చొరవను చూపించాలని కోరారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులు శ్రద్ధను చూపితేనే ఎక్కువ మంది ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు లెక్చరర్లు ఫర్జానా, స్వర్ణలత, నీరజ, లైబ్రేరియన్ గ్రేసీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీపీ స్వరూప

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని భస్వాపూర్ భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి దేవాలయంలో సోమవారం సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు హాజరై కల్యాణాన్ని ఆసక్తిగా తిలకించారు. ఈ వేడుకల్లో ఎంపీపీ స్వరూపనరేందర్‌రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

మూలమంత్ర హోమం

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో మూలమంత్ర హోమం నిర్వహించారు. సుబ్రహ్మణ్యస్వామి జన్మదినం (స్కంద షష్టి) సందర్భంగా వేద పండితుడు శాస్త్రుల వామనశర్మ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, త్రిశతి నామార్చన మహా హారతి, మంత్రపుష్పం, అష్టోత్తర శత సుబ్రహ్మణ్యం మూల మంత్ర హవనము నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు ఉన్నారు.

నకిలీ విలేకరుల హల్‌చల్

శివ్వంపేట(నర్సాపూర్): నకిలీ విలేకరుల ముసుగులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు వ్యక్తులు గుర్తింపులేని వివిధ ప్రతిక, చానళ్ల ఐడెంటి కార్డులతో తిరుగుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. శివ్వంపేట మండలంలో ఈ నకిలీ విలేకరుల ముఠా ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. సోమవారం ఇద్దరు వ్యక్తులు విలేకర్లమంటూ కొత్తపేట చౌరస్తా వద్ద ఉన్న ఇటుక బట్టీల వద్దకు వెళ్లి ఫొటోలు తీసి నిర్వాహకులను డబ్బులు డిమాండ్ చేశారు. అనుమానం వచ్చిన ఇటుక బట్టీల నిర్వాహకులు వారిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వారిని పోలీసులు విచారించారు. నిత్యం మండలంలోని పలు గ్రామాల్లో తిరుగుతూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు వాపోయారు.

విద్యార్థులను రెగ్యులర్‌గా పంపించాలి

చిన్నశంకరంపేట(మెదక్): ఇంటర్ విద్యార్థులను క్రమం తప్పకుండా కళాశాలకు పంపించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్ తల్లిదండ్రులను కోరారు. సోమవారం కళాశాలలో విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కళాశాలలో సెల్‌ఫోన్ వాడకం నిషేధించామని దానికి తల్లితండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

నిజాంపేట(మెదక్): మండలంలోని నందిగామ గ్రామంలో నాలుగు రోజుల క్రితం కువైట్‌లో మృతి చెందిన తన స్నేహితుడి కుటుంబానికి బాల్య మిత్రులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ మేరకు సోమవారం మండలంలోని నందిగామ గ్రామానికి చెందిన పాపయ్యగారి బాబు(30) కువైట్‌లో మృతి చెందాడు. ఈ విషయమై బాల్య స్నేహితులు ఎంపీటీసీ లద్ద సురేశ్, బిజ్జ మహేందర్ రూ.16000 బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఆకుల స్వామి, ఆకుల తిరుపతి, ఆకుల రమేశ్, శివగౌడ్, జలమంద రాజు, లద్ద కుమార్, కిరణ్ రమేశ్, నాగరాజు, సురేశ్ కనకరాజు, సాయి తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎం ప్రారంభం

తూప్రాన్: పట్టణంలోని డీసీసీబీ బ్యాంకులో నూతనంగా సోమవారం ఆ బ్యాంకు జనరల్ మేనేజర్ పురుషోత్తంరావు ఏటీఎంను ప్రారంభించారు. కార్యక్రమంలో బ్యాంకు ఏజీఎం మహేశ్, మేనేజర్ లలిత, ఫీల్డ్ ఆఫీసర్ రాజిరెడ్డి, సిబ్బంది లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలు పూర్తి చేయాలి

ఎంపీడీఓ భారతి

శివ్వంపేట(నర్సాపూర్): హరితహారంలో భాగంగా నిర్దేశించిన మొక్కల పెంపకం లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఎంపీడీఓ భారతి ఆదేశించారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లోని నర్సరీలను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నర్సరీల్లో అన్ని రకాల మొక్కలను పెంచాలని, ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.



చెన్నాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని మెదక్ – నర్సాపూర్ జాతీయ రహదారి పోతంశెట్టిపల్లి గ్రామంలోకి వెళ్లే మార్గమధ్యలో ఉన్నటువంటి దూలకుంట వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. వర్షాకాలం వచ్చిందంటే గ్రామంలోకి వెళ్లే రహదారిపై దూలకుంట అలుగు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో ఇటువైపుగా రాకపోకలు నిర్వహించే పోతంశెట్టిపల్లి గ్రామ ప్రజలతో పాటు వెంకటాపూర్, అంసాన్‌పల్లి, వసురం తండా తదితర గ్రామాల ప్రజలు మెదక్ వెళ్లాలంటే ఈ మార్గం కుండానే వెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలంలో బ్రిడ్జి పై నుంచి నీరు పొంగి పొర్లుతుంది. ఎట్టకేలకు ప్రజల విజ్ఞప్తులకు స్పందించిన ప్రభుత్వం, అధికారులు ఎన్నికలకు ముందే బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరు అయినట్లు చెప్పారు. టెండర్ పనులు సైతం పూర్తయ్యాయని ఎలక్షన్ల కారణంగా పనులు నిలిచిపోయాయని ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాస్ తెలిపారు. త్వరలోనే బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు ఆయన 'సాక్షి'తో తెలిపారు.

నిర్మాణం త్వరగా చేపట్టాలి



బ్రిడ్జి నిర్మాణానికి నిధులు విడుదల కావడం సంతోషంగా ఉంది. ప్రస్తుతం ఉన్న బ్రిడ్జి వర్షాకాలం వచ్చిందంటే కుంట నీరు రహదారిపై పొంగిపొర్లడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతుంది. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణం త్వరగా జరిగేలా చూడాలి.

– భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ, పోతంశెట్టిపల్లి